క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన



పొన్నూరు: ఉమ్మడి కృష్ణ, గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి ఫిబ్రవరి 27న జరిగే ఎన్నికలకు సంబంధించి నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే మార్గాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ టీపీఓ రఘురామ్, రూరల్ సీఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఉదయం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ జియావుల్‌హక్ సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సమావేశం..

కాకుమాను: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎన్నికలకు మండలంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని తహసీల్దార్ బి.వెంకటస్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ పార్టీ నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారని, అదే నెల 27వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలో ఇప్పటికే పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా అన్ని పార్టీల నాయకులు అధికారులకు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే జయరాం బహిరంగ క్షమాపణ చెప్పాలి

పెదకాకాని: విలేకరులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఐ టీయు జిల్లా కార్యదర్శి,నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్యకాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మీడియాలో ఏదైనా కథనం లేదా వార్త తమపై వచ్చి ఉంటే సంబంధిత విలేకరులను పిలిచి సదరు అంశానికి సంబంధించిన వాస్తవాలు తెలపాల్సి ఉందన్నారు.తన అక్రమాలను, దుర్మార్గాలను ఎవరూ ప్రశ్నించ కూడదని, ప్రశ్నిస్తే అంతు చూస్తామని బెదిరించిన జయరాం తీరుపై అధిష్టానం తన వైఖరి ఏమిటో స్పష్టం చేయాలన్నారు.

ద్విచక్ర వాహనం దహనం



పొన్నూరు: మండలంలోని మన్నవ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గోళ్లమూడి సాంబయ్యకు చెందిన ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన నేపథ్యంలో సమీపంలోని రోడ్డుపై పార్క్ చేసిన బైక్‌కు మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. జరిగిన సంఘటనపై విచారణ చేసి తనకు న్యాయం చేయాలని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ఎంవీఐ రాఘవరావు

చేబ్రోలు: రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెనాలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరులో శుక్రవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడిపితే ఆరు నెలల జైలు శిక్ష లేదా పది వేలు జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు.

సీఆర్‌నగర్ వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని చౌడవరం చంద్రరాజేశ్వరరావునగర్‌లో నివసిస్తున్న ప్రజలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. చౌడవరం సీఆర్ నగర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నిరుపేదల కోసం భూ పోరాటాలు నిర్వహించి ఇళ్ల స్థలాలను భారత కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో ఇవ్వటం జరిగిందన్నారు. దానికి సంబంధించిన 16 సంవత్సరాల నుంచి అక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాల పట్టాలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రావుల అంజిబాబు, చిన్నపోతుల విజయకుమార్, దేవా నాయక్, వాసు పాల్గొన్నారు.

పడకేసిన పల్లె పాలన

- అటకెక్కిన స్వచ్ఛ లక్ష్యం
- కానరాని పారిశుద్ధ్యం
- అధ్వానంగా డ్రెయినేజి వ్యవస్థ
- పట్టించుకోని అధికారులు



చెత్తాచెదారంతో నిండిన ప్రధాన రహదారి

పొన్నూరు: పల్లె పాలన పడకేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలలు దాటుతున్నా ఇప్పటికీ పాలన ముందుకు సాగడం లేదు. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ కార్యక్రమాలు సరిగా అమలుకావడం లేదు. ప్రజాసమస్యలు ఎక్కడివి అక్కడే నిలిచిపోయి పాలన అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టే నాథుడే కరువయ్యాడు. ఏ గ్రామం చూసినా ఎక్కడిపడితే అక్కడే వేసిన చెత్తాచెదారం, మురుగుతో నిండిన కాలువలే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా దోమలు పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ సమస్యలు అన్నిచోట్ల ఉన్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కసుకర్రులో సమస్యల తిష్ట..

మండలంలోని కసుకర్రులో సమస్యలు తిష్ట వేశాయి. క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్యం మెరుగుపడ లేదు. డ్రెయినేజి వ్యవస్థ అధ్వానంగా ఉండి మురుగు రోడ్లపైకి చేరుతోంది. దోమలకు ఆవాసాలుగా మారిపోయాయి. అయినా అక్కడి అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదు. ప్రధాన రహదారిలో రోడ్డు వెంబడి చెత్త వేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

సైడు కాల్వలు లేక.. రోడ్డుపైనే మురుగు..

కసుకర్రు గ్రామస్తులను సుదీర్ఘకాలంగా వేధిస్తోన్న ప్రధాన సమస్య మురుగు. ఇక్కడి మురుగు సమస్యకు పరిష్కారం మార్గం చూపడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రధాన రహదారిలోనే కాలువ లేకపోవడంతో ప్రజలు వినియోగించిన వాడుక నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడద కూడా అధికం కావడంతో స్థానికులు నరకం అనుభవిస్తున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపైకి చేరిన మురుగు

చర్యలు తీసుకుంటాం..



కసుకర్రులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. మురుగు కాల్వల నిర్మాణానికి చర్యలు చేపడతాం. చెత్త రోడ్డుపై వేయకుండా చర్యలు తీసుకుంటాం. త్వరితగతిన సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీచేస్తాం.

–గుమ్మా చంద్రశేఖరరావు, ఎంపీడీఓ, పొన్నూరు

21, 22 తేదీల్లో అంబేడ్కర్స్ విజనపై జాతీయ సదస్సు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధరరావు, రిజిస్ట్రార్ సింహాచలం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21, 22 తేదీలలో అంబేడ్కర్స్ విజన్ ఆన్ ఇంటర్ ప్లే ఆఫ్ సోషియో పొలిటికల్ ఎకనామిక్ ఫాక్టర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు డైరెక్టర్, చైర్ ప్రొఫెసర్ వై.అశోక్ కుమార్ తెలిపారు. సదస్సు బ్రోచర్‌ను వైస్ చాన్సలర్ కె.గంగాధర రావు, రిజిస్ట్రార్ జి.సింహాచలం ఆవిష్కరించారు. సదస్సు విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 15వ తేదీలోగా పరిశోధకులు, అధ్యాపకులు, మేధావులు తమ పరిశోధన పత్రాలను పంపాలని కోరారు. సదస్సు కోశాధికారి డాక్టర్ కె. అబ్రహం లింకన్, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు, విభాగం పరిశోధకులు, సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, అబ్రహం, పాల్గొన్నారు.

మార్చి 12 నుంచి ఏఐపై అంతర్జాతీయ సదస్సు



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఐఎస్‌పీఓ ఇండియా అమరావతి చాప్టర్, ఫార్మకాలజీ విభాగం, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం సంయుక్తంగా మార్చి 12, 13 తేదీలలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. రెండు రోజులు అంతర్జాతీయ సదస్సులో హెర్బ్స్ అండ్ మోర్ లిమిటెడ్, కెన్యా, క్వెస్ట్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, మలేషియా, కింగ్ సాల్మన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, ఈజిప్ట్ దేశాల నుండి ఫార్మా రంగానికి సంబంధించిన ప్రముఖులు విచ్చేయనున్నారన్నారు. సదస్సులో ఓరల్ ప్రెజెంటేషన్, ఈ–పోస్టర్ ప్రజెంటేషన్, ఫార్మా క్విజ్లు, ఫార్మా హెక్టాన్ అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు చెప్పారు. సదస్సులో పాల్గొనదలచిన వారు చలపతిఫార్మసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించి రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ బాల మహోత్సవ్-2కే25 ప్రారంభం



బెలూన్‌లను ఎగురవేస్తున్న చైర్మన్ లావు రత్తయ్య



క్రీడా జ్యోతి తీసుకెళ్తున్న విద్యార్థులు

చేబ్రోలు: విద్యార్థులు ఎల్లప్పుడు ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం రాష్ట్ర స్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన విద్యార్థులు ముందుగా ''విజ్ఞాన్ బాల మహోత్సవ్-2కే25''లో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ చిన్నారులు మొబైల్ ఫోన్‌ను సాధ్యమైనంత తక్కువగా వినియోగించాలన్నారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ జీవితంలో కష్టపడి పనిచేయడంతో పాటు బాగా కృషి చేసిన వారే ఉన్నత స్థానాలను అధిరోహిస్తాన్నారు. క్రీడలు శారీరక ఉల్లాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడుతాయన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా తొలిసారిగా నిర్వహిస్తున్న బాల మహోత్సవ్‌లో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు జూనియర్స్, సీనియర్స్ విద్యార్థులకు మొత్తం 50కు పైగా ఈవెంట్లను నిర్వహించారు. స్పోర్ట్స్ ఫీట్‌లో బాలురకు వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 4'' 100 మీటర్ల రిలే. బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 4'' 100 మీటర్ల రిలే పోటీలు నిర్వహించారు. వీటితో పాటు మ్యూజిక్, డాన్స్, ఫైన్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించారు.

కేసుల పరిష్కారానికి కృషి: జడ్జి పవన్‌కుమార్




పొన్నూరు: పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేలా సహకారించాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి ఏకా పవన్‌కుమార్ అన్నారు. న్యాయవాదులు, ఎక్సైజ్ అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ పోలీసులు, నిందితులకు అవగాహన కల్పించి కేసులు సామరస్యంగా పరిష్కారమయ్యేలా చేయాలన్నారు.బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.జయ రాజ్, ఏజీపీ బొనిగల అంకమ్మరావు, న్యాయవాదులు ఎస్.శ్రీనివాసరావు, ఎం.ఈరేసు, వి.రాంబాబు, వి.ప్రకాశరావు, పి.వి జయ్‌కుమార్, జి. అంకమ్మరావు పాల్గొన్నారు.

అభ్యసనం నిరంతర ప్రక్రియ

గుంటూరు రూరల్: అభ్యసనం నిరంతర ప్రక్రియగా ఉండాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్ర రావు తెలిపారు. చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ చేతన వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్టార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో కలసి గడిపినప్పుడు బంధాలు నిలబడతాయని తెలిపారు. కార్యక్రమానికి రావెల సాంబశివరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బాలకుటీరు వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి ఆర్‌వీఆర్ – జేసీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ సీఏఓ దుర్గా రఘురామ్ చేతన కార్యనిర్వాహకురాలు మరుద్వతి, సహకార్యదర్శి జయశ్రీ, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎండీ నస్రీన్, మల్లికార్జున రావు, వెంకటేశ్వర్లు, డీన్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌సీకి సత్కారం



నగరంపాలెం: చేబ్రోలు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్(హెచ్‌సీ) బి.హరిబాబు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని హాల్‌లో ఆయన్ను సత్కరించారు. 42 ఏళ్లపాటు పోలీస్ శాఖకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు ఏవీ రమణమూర్తి(పరిపాలన), ఎ.హనుమంతు(ఏఆర్), సీఐ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు శ్రీహరి రెడ్డి, శివరామకృష్ణ, పోలీస్ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మయ్య, హెచ్‌సీ కరిముల్లా పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా చెత్త సంపద షెడ్లు

- చెత్త నుంచి సంపదకు నోచుకోని పంచాయతీలు
- పట్టించుకోని పాలకులు

పెదకాకాని: చెత్త నుంచి సంపద సృష్టించేందుకు ప్రభుత్వం నిర్మించిన షెడ్లు మందుబాబులకు అడ్డాగా మారాయి. పెదకాకాని మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతి గ్రామానికి ఒకటి చొప్పున చెత్త నుంచి సంపద సృష్టి పేరుతో షెడ్లు ఏర్పాటు చేసింది. మండలంలోని నంబూరులో మినహా ఏ గ్రామంలోనూ చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా ఆచరణకు నోచుకోలేదు. 2017-2018 సంవత్సరాల్లో చెత్త నుంచి సంపద సృష్టించాలనే ఆశయంతో ప్రభుత్వం ఒక్కొక్క షెడ్డును 3.50 లక్షల రూపాయల నుంచి 5 లక్షల రూపాయల వరకూ ఖర్చు చేసి నిర్మించింది. గ్రామ పంచాయితీలో సేకరించిన చెత్తను ఆ షెడ్లకు తరలించి తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నాపెడ్ తొట్టిలో వానపాములు పెంచడం, తద్వారా వచ్చిన ఎరువును అమ్మి ఆ డబ్బులు పంచాయతీ అభివృద్ధికి ఉపయోగించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆ షెడ్లకు చెత్త తరలించడం గానీ, వానపాములు వేయడం గానీ, ఎరువును తీయడం గానీ జరగలేదు. దాదాపు ఈ షెడ్లు గ్రామ శివార్లలో ఉండటంతో పలువురు మందు బాబులు ఆ షెడ్లలోకి చేరుకుని మద్యం తాగుతున్నారు. మండలంలోని తంగెళ్లమూడి గ్రామ శివార్లలో ఉన్న షెడ్డులో ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్ తాగిన ముక్కలు, ప్లాస్టిక్ గ్లాసులు, కూల్‌డ్రింక్ సీసాలు దర్శనమిస్తున్నాయి. షెడ్లలో అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





తంగెళ్లమూడి శివారులో నిర్మించిన షెడ్డు, పక్కన తొట్టెల్లో ఖాళీ మద్యం సీసాలు, గ్లాసులు

వైభవంగా పెద్దేటమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: మండల పరిధి మామిళ్లపల్లిలోని శ్రీ పెద్దేటమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మందకొడిగా దస్తావేజుల రిజిస్ట్రేషన్లు

- రిజిస్ట్రేషన్ శాఖలో సర్వర్ డౌన్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పెదకాకాని రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వేచిఉన్న ప్రజలు

పొన్నూరు: ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూమి విలువలు పెరుగుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ముందుగా రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు క్రయ, విక్రయదారులు పొన్నూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి బారులు తీరారు. దస్తావేజులు పెరిగి సర్వర్లు నెమ్మదించడంతో శుక్రవారం స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందకొడిగా సాగింది. దీంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన స్థిరాస్తి క్రయ, విక్రయదారులకు పడిగాపులు తప్పలేదు. గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో కొందరు వెనుదిరిగారు. సవరించిన భూ, నిర్మాణాల కొత్త మార్కెట్ విలువలు నేటి నుంచి అమలులోకి రానున్న నేపథ్యంలో స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజుల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారి సంఖ్య పెరిగింది. దీంతో సర్వర్లపై ఒత్తిడి పెరిగి నెమ్మదించాయని అధికారులు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో పొన్నూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మొత్తంగా రోజుకు 10 నుంచి 15 వరకు వరకు రిజిస్ట్రేషన్లు ఉంటాయి. ప్రస్తుతం వీటి సంఖ్య పెరిగింది. ఒప్పందం(అగ్రిమెంట్లు) చేసుకున్న స్థిరాస్తి క్రయ, విక్రయ దారులు ముందుగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని వచ్చారు. సర్వర్లు నెమ్మదించడంతో సమస్య తలెత్తింది. గురువారం 44 దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగాయి. శుక్రవారం సర్వర్ సమస్య ఎక్కువగా ఉండటంతో సాయంత్రం 5 గంటల వరకు 25 వరకే దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగాయని, సర్వర్లు వేగంగా ఉంటే మరికొన్ని జరిగి ఉండేవని సిబ్బంది చెబుతున్నారు. పొన్నూరు పరిధిలో 9 నుంచి 10 శాతం వరకు మాత్రమే విలువలు పెరుగనున్నాయని సబ్ రిజిస్ట్రార్ పర్వీన్ బాబి తెలిపారు.

నేటి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల బాదుడే.. బాదుడు

పెదకాకాని: అడ్డగోలుగా ఆదాయం పెంచుకోవడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీలో భారీగా రిజిస్ట్రేషన్ చార్జీల బాదుడుకు సిద్ధపడింది. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా 10 నుంచి 40 శాతం మేరకు రిజిస్ట్రేషన్ చార్జీల వసూలుకు కార్యాచరణ మొదలైంది. ఈ ధరలు ఫిబ్రవరి ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో భూములు, నివాస, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల విలువలు అమాంతం పెంచడంపై సామాన్య, మధ్య తరగతి వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేది లేదంటూ కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన మాటను కేవలం ఎనిమిది నెలల్లోనే తప్పుతూ జనంపై బాదుడుకు సిద్ధమయ్యారు. పెరిగిన ఛార్జీల ప్రకారం ఒక లక్షకు అదనంగా సుమారు 7,500 రూపాయలు అదనంగా చెల్లించాల్సి వస్తుందని భూ వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

సత్య శోధక్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి

- రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం
- ముగిసిన జాతీయ సదస్సు



పరిశోధకులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న రిజిస్ట్రార్ సింహాచలం

ఏఎన్‌యూ: మహాత్మ జ్యోతిరావు పూలే తీసుకువచ్చిన సత్యశోధక్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యతలుపరిశోధకులు, యువత తీసుకోవాలని రిజిస్ట్రార్ జి.సింహాచలం సూచించారు. పూలే చేసిన సంఘ సంస్కరణలపై పరిశోధనలు విస్తృతంగా జరగాలని ఆకాంక్షించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని మహాత్మ జ్యోతి రావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో యూజీసీ సహకారంతో నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి సెమినార్ డైరెక్టర్ ఎం.త్రిమూర్తి రావు అధ్యక్షత వహించారు. రిజిస్ట్రార్ సింహాచలం, పూలే అధ్యయన కేంద్రం వ్యవస్థాపక డైరెక్టర్ ఆచార్య నూర్ బాషా అబ్దుల్ మాట్లాడుతూ నేటి మహిళలు సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. సీడీసీ డీన్ వి.రవికుమార్, ఓఎస్‌డీ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవి కుమార్,, దివ్యతేజో మూర్తి, సిహెచ్.స్వరూప రాణి, కె.సోమశేఖర్ మాట్లాడారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ

చేబ్రోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. తాడేపల్లి నుంచి ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర మహాసభల జాతా శుక్రవారం నారాకోడూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు పార్టీ జిల్లా నాయకుడు దండా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. నేతాజీ మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు. కేంద్రం తెచ్చిన కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక నిర్ణయాలలో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వాములవ్వడం వల్ల ఇక్కడ ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వసంత కుమారి, షర్ఫుద్దీన్, నరసింహారావు, చింతల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ ఫార్మనెస్ట్ సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

గుంటూరు రూరల్: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఫార్మసీ రంగంలో పెను మార్పులు తీసుకురానుందని ఏపీటీఐ ప్రెసిడెంట్ డాక్టర్ కె వెంకటరమణ తెలిపారు. రెండు రోజులుగా చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఫార్మనెస్ట్ సదస్సు శుక్రవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ ఏఐని సక్రమమైన మార్గంలో నడిపించి అభివృద్ధి వైపు అడుగులు వేయాలని అందుకు అనుగుణంగా ప్రతి ఫార్మసిస్ట్ విద్యార్థి స్థాయి నుంచి ఎంతో కష్టపడాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఔషదాల తయారీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రాముఖ్యత, అభివృద్ధి అనే అంశంపై డాక్టర్ వి వెంకటరావు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏపీటీఐ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వై. అంకమ్మ చౌదరి, సెక్రటరీ డి.నరేంద్ర, ఎంఏఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్, అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ సీఎన్ శ్రీనివాస్, ట్రెజరర్ ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.